# పవిత్ర హజ్జ్ యాత్ర

## శుభాలు మరియు లాభాలు

అల్ హమ్దులిల్లాహ్ (సకల ప్రశంసలు, స్తోత్రములు అల్లాహ్ కే చెందును). ముహమ్మదుర్రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అంటే అల్లాహ్ యొక్క అంతిమ సందేశహరుని పై శాంతి, దీవెనలు కురుయుగాక.

ఇది పవిత్ర హజ్జ్ యాత్ర – దాని యొక్క శుభాలు, ప్రయోజనాలు మరియు కొన్ని నియమ నిబంధనల గురించిన ఒక క్లుప్తమైన చర్చ.

### 1. హజ్జ్ యాత్ర ఎప్పుడు ఆజ్ఞాపించబడినది

హజ్జ్ యాత్ర దౌత్యబృందాల (అల్ ఉఫూద్) సంవత్సరంగా ప్రసిద్ధి గాంచిన హిజ్రీ 9వ సంవత్సరంలో అవతరించిన క్రింది దివ్యఖుర్ఆన్ వచనం ఆధారంగా ఆజ్ఞాపించబడినదని ఒక సరైన అభిప్రాయం. ఈ వచనంలో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: **"మరియు (కాబా) గృహానికి హజ్జ్ యాత్ర (మక్కా నగరపు పవిత్ర యాత్ర) అనేది తమ (ప్రయాణ) ఖర్చులు భరించ గలిగే స్థోమతు గల మానవులు తప్పక పూర్తి చేయవలసి ఉన్న అల్లాహ్ యొక్క హక్కు."** [ఖుర్ఆన్ 3:97]

### 2. హజ్జ్ గురించిన ఆదేశం

హజ్జ్ అనేది ఒక ఫరీదా అంటే తప్పని సరిగా (విధిగా) నెరవర్చవలసి ఉన్న ఆచరణ. ఇది ఇస్లాం ధర్మపు మూలస్థంభాలలో ఒకటి. దీనికి ఆధారం పైన ఉదహరించిన దివ్యఖుర్ఆన్ యొక్క వచనం. అంతే కాక ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క బోధనలలో (సున్నహ్ లో) కూడా ఈ వచనాన్నే సమర్ధిస్తున్న అనేక ఆధారాలు ఉన్నాయి. ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ఉపదేశించారు: **"ఇస్లాం ఐదింటిపై (మూలస్థంభాలపై) నిర్మించబడి ఉన్నది: అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు ఎవ్వరూ లేరు మరియు ముహమ్మద్ అల్లాహ్ యొక్క సందేశహరుడు అని సాక్ష్యమివ్వటం,నమాజు స్థాపించటం, జకాహ్ (తప్పని సరి విధి దానం) చెల్లించటం, హజ్జ్ యాత్ర చేయటం మరియు రమదాన్ నెల ఉపవాసం ఉండటం."** (బుఖారీ మరియు ముస్లిం హదీథ్ గ్రంథాలు).

### 3. హజ్జ్ యాత్ర తప్పని సరి అనే ఆజ్ఞ స్పష్టమైనదేనా?

అవును, ఇది తప్పని సరిగా పూర్తి చేయవలసిన యాత్ర. దీనికి ఆధారం పైన ఉదహరించబడిన వచనం. ఇది షరిఅహ్ (ఇస్లామీయ జీవన విధానానికి) కు సంబంధించిన ఒక స్పష్టమైన మార్గదర్శకత్వపు నియమం. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క ఉపదేశాలలో దీని ఆధారాలు క్రింద ఇవ్వబడినవి:

a. అబూ హురైరాహ్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ఉపదేశించినారు: **"ఓ ప్రజలారా, అల్లాహ్ మీ పై హజ్జ్ ను తప్పనిసరి చేసినాడు, కాబట్టి హజ్జ్ చేయండి. "** (ముస్లిం హదీథ్ గ్రంథం).
b. ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఇంకో హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా బోధించినారు: **"ఎవరైనా హజ్జ్ చేయాలని సంకల్పించుకున్నట్లయితే, అతను దానిని పూర్తి చేయటానికి త్వరపడవలెను, ఎందుకంటే అతను వ్యాధిగ్రస్తుడు కావచ్చు లేదా వేరే ఇతర సమస్యలు తలెత్త వచ్చు."** (అబూ దావూద్ హదీథ్ గ్రంథం) ఎందుకంటే అతను...... అనే పద సమూహం లేకుండా ఇదే హదీథ్ ఇబ్నె మాజా హదీథ్ గ్రంథం మరియు అహ్మద్ హదీథ్ గ్రంథాలలో కూడా నమోదు చేయబడి ఉన్నది). ఇక్కడ అహ్మద్ ఉల్లేఖించిన నివేదికలో **"హజ్జ్ చేయటానికి (అంటే తప్పని సరి హజ్జ్ చేయటానికి) త్వరపడవలెను – ఎందుకంటే తమకు ఏమి జరగ బోతుందో మీలో ఎవ్వరికీ తెలియదు కదా"** అని ఉన్నది. ఈ రెండు నివేదికలు ఒకదానినొకటి బలపరుచుకుంటున్నాయి. (అల్ బానీ రచించిన ఇర్వా అల్ గలీల్, 4/168 చూడండి).

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన హజ్జ్ ను 10వ హిజ్రీ సంవత్సరం వరకు వాయిదా వేసిన సంఘటన ఆధారంగా, హజ్జ్ ను ఆలస్యం చేయ వచ్చని షాఫయీ అభిప్రాయపడుతున్నారు. కాని ఈ అభిప్రాయానికి సమాధానం ఇలా ఉన్నది:

a. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కేవలం ఒక సంవత్సరం మాత్రమే ఆలస్యం చేసినారు కాని వారు అపరిమితంగా ఆలస్యం చేయవచ్చని అభిప్రాయపడుతున్నారు!
b. బహుదైవారాధనల నుండి మరియు నగ్న ప్రదక్షిణల నుండి కాబా గృహాన్ని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్రం చేయాలని కోరుకున్నారు.
c. తమ ఇస్లాం స్వీకరణను ప్రకటించటానికి ఒకరి తర్వాత ఒకరుగా ఎడతెరపి లేకుండా మదీనా పట్టణానికి వస్తున్న సమూహాములతో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బిజీ అయిపోయినారు.

(షేఖ్ ఇబ్నె ఉథైమీన్ రచించిన అల్ షరహ్ అల్ ముమ్తి, 7/17, 18 చూడండి)

## 4. తమ జీవిత కాలంలో ఒక్కసారి హజ్జ్ చేయటం తప్పని సరి విధి.

అబూ హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక ప్రసంగంలో (ఖుత్బాలో) ఇలా ఉపదేశించారు: **"ఓ ప్రజలారా, అల్లాహ్ మీ పై హజ్జ్ ను తప్పని సరి చేసినాడు, కాబట్టి మీరు హజ్జ్ చేయండి."** ఒక వ్యక్తి ఇలా ప్రశ్నించెను - ప్రతి సంవత్సరమా, ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా? వారు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆ వ్యక్తి ఇదే ప్రశ్నను మరల మరల మూడు సార్లు అడుగగా, వారు ఇలా సమాధానమిచ్చినారు **"ఒకవేళ నేను అవును అంటే, అది తప్పని సరి అయిపోతుంది మరియు మీరు దానిని ఆచరించ లేక పోతారు."** ఆ తర్వాత వారు ఇలా పలికారు, **"మీకు తెలిపిన విషయాలు తప్ప మరిన్ని అదనపు**

**విషయాలు తెలుపమని నా పై వత్తిడి చేయవద్దు, మీ కంటే పూర్వం వచ్చిన ప్రజలు ఇదే కారణంగా నాశనమైపోయారు ఎందుకంటే వారు తమ ప్రవక్తలను చాలా ఎక్కువగా ప్రశ్నించేవారు మరియు వాదించేవారు. ఒకవేళ నేను మిమ్ముల్ని ఏదైనా ఆచరణ చేయమని ఆదేశించినచో, దానిని మీరు సాధ్యమైనంత అధికంగా ఆచరించండి మరియు ఒకవేళ నేను మిమ్మల్ని ఏదైనా ఆచరణ చేయవద్దని నిరోధించినచో, దానిని మీరు బహిష్కరించండి."** (ముస్లిం హదీథ్ గ్రంథం)

## 5. హజ్జ్ యొక్క శుభాలు

హజ్జ్ యొక్క శుభాల గురించి వివరించే హదీథ్ లు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్ని:

a. అబూ హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖన ప్రకారం ఒకసారి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ను **"ఏ ఆచరణ ఉత్తమమైనది?"** అని ప్రశ్నించగా, వారు **"అల్లాహ్ పై మరియు అల్లాహ్ యొక్క సందేశహరుని విశ్వసించటం"** అని సమాధానమిచ్చినారు. **"ఆ తర్వాత ఏది?"** అని మరల ప్రశ్నించగా, వారు **"అల్లాహ్ కోసం జిహాద్ (ధర్మయుద్ధం) చేయటం"** అని సమాధానమిచ్చినారు. **"ఆ** తర్వాత ఏది?" అని మరల ప్రశ్నించగా, వారు **"స్వీకరింపబడిన హజ్జ్."** అని సమాధానమిచ్చినారు. (సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథాలు).

స్వీకరించబడిన హజ్జ్ అంటే:

1. న్యాయంగా సంపాదించిన ధనం నుండి హజ్జ్ ఖర్చులు చెల్లింపబడ వలెను.
2. హజ్జ్ సమయంలో చెడు, పాపకార్యాలు, దుష్టత్వం మరియు అన్యాయమైన తగాదాల నుండి దూరంగా ఉండవలెను.
3. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనల అంటే సున్నహ్ ప్రకారం మాత్రమే హజ్జ్ లోని ఆరాధనలు ఆచరించ వలెను.
4. ఇతరులకు చూపటానికి (పేరు కోసం, కీర్తిప్రతిష్టల కోసం) హజ్జ్ చేయరాదు; హజ్జ్ అనేది చిత్తశుద్ధితో మరియు పవిత్రతతో కేవలం అల్లాహ్ యొక్క స్వీకరణ కోసం మాత్రమే చేయవలెను.
5. అల్లాహ్ కు అవిధేయత చూపే పనులు మరియు పాపకార్యాలు చేయరాదు.

a. అబూ హురైరా రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకసారి ఇలా ఉపదేశించినారు: **"ఎవరైతే అల్లాహ్ కోసమే హజ్జ్ చేస్తారో మరియు (తన భార్యతో) సంభోగం చేయరో, పాపకార్యాలు చేయరో, అన్యాయపు తగాదాలలో పాల్గొనరో అటువంటి వారు తల్లి జన్మనిచ్చిన దినం నాటి స్థితిలో (అంతటి పవిత్రతో) మరలి వస్తారు."** (సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథాలు)

b. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మరో ఉపదేశాన్ని అబూ హురైరా రదియల్లాహు అన్హు ఒక ఉల్లేఖనలో ఇలా తెలిపినారు: "'**ఉమ్రా** (హజ్జ్ దినాలలో కాక వేరే దినాలలో మక్కా యాత్ర) **యాత్ర, దానికి మరియు క్రితం ఉమ్రా కు మధ్య కాలంలో జరిగిన పాపాలను ప్రక్షాళణ చేయును. మరియు స్వీకరించబడిన హజ్జ్ కు లభించే ప్రతిఫలం స్వర్గం కంటే తక్కువగా ఉండదు** (అంటే స్వర్గం ప్రాప్తమగును)." (సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథాలు).

c. ఆయెషా రదియల్లాహు అన్హా ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు: ఒకసారి ఆయెషా రదియల్లాహు అన్హా ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తో ఇలా ప్రశ్నించారు, "**ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా! మేము కూడా సైనిక చర్యల పరంపరలలో పాల్గొనటానికి మీతో పాటు బయలు దేరి, జిహాద్ యుద్ధాలలో పోరాడవచ్చునా?** " వారు ఇలా సమాధానమిచ్చినారు, "**కాని హజ్జ్ అంటే స్వీకరించబడిన మక్కా పవిత్ర యాత్ర అనేది అత్యంత ఉత్తమమైన మరియు సౌందర్యవంతమైన ధర్మయుద్ధమే (జిహాద్).**" ఆ తర్వాత ఆయెషా రదియల్లాహు అన్హా ఇలా తెలిపారు, అల్లాహ్ యొక్క సందేశహరుని (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి ఈ ఉపదేశం విన్ననాటి నుండి నేను ఏనాడూ హజ్జ్ యాత్రకు వెళ్ళకుండా ఉండలేదు. (సహీహ్ బుఖారీ హదీథ్ గ్రంథం).

d. అమర్ బిన్ ఆస్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఇంకో హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు: "**హజ్జ్ తనకు పూర్వం జరిగిన వాటినన్నింటినీ (పాపాలన్నింటినీ) తుడిచి వేయును.**" (సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథం).

e. అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు ఉల్లేఖించిన ఒక హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు:"**హజ్జ్ మరియు ఉమ్రా చేస్తూ ఉండండి, ఎందుకంటే అవి బీదరికాన్ని మరియు పాపాల్ని తొలగించును ఎలాగైతే కొలిమితిత్తులు ఇనుము, బంగారం, వెండి నుండి మలినాలను తొలగించునో.**" (అత్తిర్మిథీ హదీథ్ గ్రంథం; అన్నిసాయీ హదీథ్ గ్రంథం. సిల్సిలాహ్ అల్ సహీహాహ్ అనే గ్రంథంలో షేఖ్ అల్ బానీ ఈ హదీథ్ ను సహీహ్ హదీథ్ గా వర్గీకరించారు).

f. ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఉల్లేఖించిన ఇంకో హదీథ్ లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించినారు: "**అల్లాహ్ కోసం ధర్మయుద్ధం చేసేవారు మరియు హజ్జ్ లేక ఉమ్రా చేయటానికి బయలు దేరిన ప్రయాణికులు అల్లాహ్ యొక్క అతిథులే. అల్లాహ్ వారిని ఆహ్వానించెను మరియు వారు ఆ ఆహ్వానాన్ని స్వీకరించినారు; వారు అల్లాహ్ ను వేడుకుంటారు మరియు అల్లాహ్ వాటిని ప్రసాదిస్తాడు**" (ఇబ్నె మాజా హదీథ్ గ్రంథం. సిల్సిలాహ్ అల్ సహీహాహ్ అనే గ్రంథంలో షేఖ్ అల్ బానీ ఈ హదీథ్ ను సహీహ్ హదీథ్ గా వర్గీకరించారు).

## 6. హజ్జ్ యొక్క ప్రయోజనాలు

దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు (ఖుర్ఆన్ భావం యొక్క అనువాదం): "**వారికి ప్రయోజనం కలిగించే విషయాలను వారు చూస్తారు**" [అల్ హజ్జ్ అధ్యాయం 22:28]

హజ్జ్ వలన కలిగే రెండు విధాలా ప్రయోజనం కలుగును – ప్రాపంచిక ప్రయోజనం మరియు ధార్మిక అంటే అధ్యాత్మిక ప్రయోజనం.

ధార్మిక ప్రయోజనాలు ఏమిటంటే, ఎవరైతే హజ్జ్ యాత్రకు వెళతారో, వారు అల్లాహ్ యొక్క ప్రసన్నతను పొందుతారు మరియు తమ పాపాలన్నింటినీ క్షమింపజేసుకుని మరలి వస్తారు. మరెక్కడా లభించనంతటి పుణ్యాలను కూడా పొందుతారు. మస్జిద్ అల్ హరామ్ లో ప్రతి నమాజుకు లభించే పుణ్యాలు వేరే ఇతర ప్రాంతాలలోని నమాజు కంటే లక్ష రెట్లు ఎక్కువ. అంతేకాక కాబాగృహపు తవాఫ్ మరియు సయీ మరెక్కడా చేయలేరు.

ఇతర ప్రయోజనాలలో ఇతర దేశాలలో నివసించే తోటి ముస్లింలను కలుసుకోవటం మరియు వారి ప్రాంతాలలోని విషయాలను తెలుసుకోవటం, ఇస్లామీయ పండితులను కలుసుకుని మంచి మంచి విషయాలు నేర్చుకోవటం మరియు తమ సమస్యలకు వారి నుండి సమాధానాలు పొందటం మొదలైనవి.

ప్రాపంచిక ప్రయోజనాలలో వ్యాపారం మరియు లావాదేవీలు, ఇంకా హజ్జ్ ద్వారా లభించే ఇతర ప్రయోజనాలు.

## 7. హజ్జ్ గురించిన నియమనిబంధనలు మరియు ప్రజలపై వాటి అధ్యాత్మిక ప్రభావం.

హజ్జ్ ఆచరణల వెనుక అనేక శుభాలు మరియు చాలా వివేకం దాగి ఉన్నది. ఎవరికైతే ఆ ఆచరణల సరైన జ్ఞానం ప్రసాదించబడినదో, వారికి అనేక శుభాలు ప్రసాదించబడినట్లే. ఉదాహరణకు:

a. హజ్జ్ పూర్తి చేయటానికి చేస్తున్న పవిత్ర యాత్ర, అతనికి అల్లాహ్ వైపు మరియు పరలోకం వైపు చేసే ప్రయాణాన్ని జ్ఞాపకం చేయును. ఎప్పుడైతే వారు ప్రయాణం చేస్తారో, వారు తమ వెనుక తమ ప్రాణస్నేహితులను, భార్యాపిల్లలను మరియు తమ జన్మభూమిని వదిలి వేస్తారు. ఇది వారికి తమ పరలోకపు ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చును.
b. ఎవరైతే ఈ పవిత్ర యాత్ర చేయాలనుకున్నారో, వారు తమ ప్రయాణ ఖర్చులు, వస్తు సామగ్రి వెంట తీసుకుని పోవలెను. కాబట్టి అల్లాహ్ గృహానికి క్షేమంగా, సౌలభ్యంగా చేరేటందుకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేసుకోవలెను. ఈ విషయం గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: **“మరియు ప్రయాణనకు అవసరమైన వస్తుసామగ్రి తీసుకోండి, కాని అత్యన్నతమైన వస్తుసామగ్రి తఖ్వా (అల్లాహ్ యొక్క భయభక్తుల, సత్ ప్రవర్తన)”** *[అల్ బఖరాహ్ 2:197]*
c. దూరప్రయాణాలలో తీవ్రమైన మానసిక మరియు శారీరక పీడనం కలుగును. పరలోక యాత్రలో కూడా అలాంటి తీవ్రమైన లేక అంతకంటే ఎక్కువ తీవ్రమైన యాతనయే కలుగును. మానవుడి ముందు అతని అవసాన దశ, మరణ దశ, సమాధి దశ, తీర్పు దిన సమావేశ దశ, పాపపుణ్య లెక్కల దశ, తీర్పు త్రాసు దశ, సిరాత్ అనే వంతెన దాటే దశ, చివరిగా స్వర్గ లేక నరక స్థానానికి చేరే దశ. ఈ సుదీర్ఘ ప్రయాణంలో కేవలం అల్లాహ్ చే రక్షింపబడిన వారే సాఫల్యవంతులు. కాబట్టి ఈ పవిత్ర హజ్జ్ యాత్రలో

పడే కష్టాలు మరియు హజ్జ్ పూర్తి చేయటం ద్వారా పొందే సాఫల్యం, పరలోక ప్రయాణంలోని కష్టాలను మరియు చివరికి పొందే సాఫల్యాన్ని జ్ఞాపకం చేయును.

d. హజ్జ్ ప్రయాణికుడు రెండు ఇహ్రామ్ వస్త్రములలో చుట్టుకోవటమనేది, తను చనిపోయిన తర్వాత తన మృతదేహానికి చుట్టే కఫన్ వస్త్రములను జ్ఞాపకానికి తెచ్చును. ఇది అవిధేయతను మరియు పాపకార్యాలను వదిలివేయటానికి అతడిని ప్రోత్సహించును. ఎలాగైతే అతడు హజ్జ్ కోసం మామూలుగా ధరించే తన దుస్తులను త్యజించాడో, అలాగే అతడు తన పాపాలను కూడా త్యజించవలసి ఉంటుంది. ఎలాగైతే అతడు హజ్జ్ కోసం రెండు తెల్లటి పరిశుభ్రమైన వస్త్రములను చుట్టుకొనెనో, అలాగే అతడు తన హృదయంలో బహుదైవారాధన (షిర్క్), అవిశ్వాసం (కుఫ్ర్), కపటత్వం (నిఫాఖ్) వంటి మలినాలకు చోటివ్వకుండా పరిశుభ్రంగా మరియు తెల్లగా (పవిత్రంగా) ఉంచుకోవలెను. మరియు తన ఆచార వ్యవహారాలను దుష్టాలోచనల, పాపకార్యాల మరియు అవిధేయతల వంటి మలినాల ప్రభావానికి లోను కానివ్వకుండా పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచుకోవలెను.

e. **“లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ (హాజరయ్యాను ఓ అల్లాహ్, హాజరయ్యాను)”** అని మీఖాత్ వద్ద (మక్కా నగరపు ఇహ్రామ్ వస్త్రములు ధరించ వలసిన సరిహద్దు వద్ద) పలుకుతున్నప్పుడు, అతను తన ప్రభువు పిలుపును అందుకుని, దానిని శిరసావహిస్తున్నానని సమాధానమిస్తున్నాడు. మరి ఒకవైపు హాజయ్యాను, ప్రభూ అని అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ, ఇంకో వైపు పాపకార్యాలను వదిలివేయమంటున్న అదే అల్లాహ్ ఆజ్ఞలను అందుకుని కూడా వాటిని వదిలి పెట్టక, వాటినే ఎలా అంటిపెట్టుకుని ఉంటున్నాడు? **“లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక అంటే హాజరయ్యాను ఓ అల్లాహ్, హాజరయ్యాను”** అని అతను పలుకుతున్న పలుకులకు అసలు అర్థం, **“నేను మీ నిషేధాజ్ఞలను శిరసావహిస్తున్నాను మరియు నేను ఇప్పుడే వాటిని శాశ్వతంగా వదిలి వేస్తున్నాను”** అని.

f. అతను ఇహ్రాం స్థితిలో అల్లాహ్ చే నిషేధింపబడిన (హరాం) విషయాలను వదిలిపెట్టి, తల్బియా **“లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక అంటే హాజరయ్యాను ఓ అల్లాహ్, హాజరయ్యాను”** మరియు తల్బియా (అల్లాహ్ యొక్క ధ్యానం) లలో తీరిక లేకుండా ఉండటమనేది ఒక ముస్లిం ఎల్లప్పుడూ ఎలా ధ్యానంలో మునిగి ఉండాలో అతనికి తెలియజేయును. అతను ఇహ్రాం స్థితిలో ఉన్నప్పుడు, మామూలు స్థితిలో అనుమతింపబడిన (హలాల్) విషయాలకు కూడా దూరంగా ఉంటూ స్వయంగా క్రమశిక్షణను అభ్యాసం చేస్తున్నాడు. మరి, అటువంటి స్వయం శిక్షణ పొంది కూడా, ఇహ్రాం స్థితి నుండి బయటికి వచ్చీ రాగానే అన్ని సమయాలలో మరియు అన్ని ప్రాంతాలలో వర్తించే అల్లాహ్ యొక్క శాశ్వత నిషేధాజ్ఞలను ఎలా అతిక్రమిస్తున్నాడు?

g. మొత్తం మానవజాతి కోసం పవిత్ర ప్రాంతంగా అల్లాహ్ నిర్ణయించిన పవిత్ర కాబాగృహంలో ప్రవేశించినప్పుడు, అతను పునరుత్థాన దినాన్ని జ్ఞాపకం చేసుకొనును. అక్కడికి కష్టపడకుండా, వ్యయప్రయాసాలకు గురి కాకుండా, చిత్తశుద్ధితో ప్రయత్నించకుండా ఎవ్వరూ చేరుకోలేరు. పునరుత్థాన దినం నాడు ఒక వ్యక్తిని క్షేమంగా ఉంచగలిగేది బహుదైవారాధనలకు అస్సలు తావివ్వని తౌహీద్ అంటే ఏకైక దైవత్వ విశ్వాసం మాత్రమే. దీని గురించి అల్లాహ్ దివ్యఖుర్ఆన్ లో ఇలా ప్రకటిస్తున్నాడు:

**“వాస్తవానికి, విశ్వసించినవారికే, తమ విశ్వాసాన్ని దుర్మార్గంతో కలుషితం చేయని వారికే శాంతి, వారు మాత్రమే ఋజుమార్గంపై ఉన్నారు.”** *[అల్ అన్ఆమ్ 6:81].*

కాబాగృహపు ఒక మూలలోని గోడలో ఉన్న నల్లటి రాయిని ముద్దు పెట్టుకోవటమనేది ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క విధానాన్ని (సున్నహ్ ను) గౌరవించమని మరియు అల్లాహ్ యొక్క ఆదేశాలను అవివేకమైన బలహీన తర్కములతో వ్యతిరేకించవద్దని బోధిస్తున్నది. అతను మానవజాతి కోసం అల్లాహ్ అవతరింపజేసిన ధర్మచట్టం మరియు ధర్మారాధనల వెనుక ఉన్న వివేకం మరియు శుభం కనిపెడతాడు. ఇంకా అతను స్వయంగా తనకు తానుగా అల్లాహ్ కు సంపూర్ణంగా సమర్పించుకునేందుకు శిక్షణ ఇచ్చుకుంటాడు. ఒకసారి ఉమర్ రదియల్లాహు అన్హు కాబాగృహపు నల్లరాతిని ముద్దు పెట్టుకుని, ఇలా పలికినారు: “నాకు తెలుసు నీవు మంచి గాని, చెడు గాని కలిగించలేని కేవలం ఒక రాయివి మాత్రమే. నేను గనుక ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిన్ను ముద్దు పెట్టుకోవటం చూసి ఉండకపోతే, నేను నిన్ను ముద్దు పెట్టుకునేవాడిని కాను.” (బుఖారీ మరియు ముస్లిం హదీథ్ గ్రంథాలు).

h. తవాఫ్ చేస్తున్నప్పుడు, నిర్దిష్ట ప్రయోజనం కోసం మొత్తం మానవజాతి సందర్శించే ఒక ఆశ్రయంగా మరియు ఒక సురక్షిత ప్రదేశంగా కాబా గృహాన్ని నిర్మించిన తండ్రి ఇబ్రాహీం (అలైహిస్సలాం) మరియు కాబాగృహాన్ని సందర్శించమని ఇచ్చిన ఆయన పిలుపు అతనికి జ్ఞాపకం వచ్చును. అంతేకాక మన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడా హజ్జ్ యాత్ర చేయమని పిలుపునిచ్చారు. ఇంకా మూసా, యూనుస్ మరియు ఈసా అలైహిస్సలాంలు కూడా ఈ పవిత్ర గృహాన్ని సందర్శించి యున్నారు. ఈ పవిత్ర గృహం ప్రవక్తలకు ఒక చిహ్నంగా మరియు ఒక సమావేశ స్థలంగా మారినది; కాబాగృహాన్ని నిర్మించమని మరియు దానిని ప్రార్థనా స్థలంగా ప్రకటించమని ఇబ్రాహీం అలైహిస్సలాం ను అల్లాహ్ యే స్వయంగా ఆదేశించినప్పుడు, అది అలా ప్రఖ్యాత సమావేశ స్థలంగా మారకుండా ఉండగలదా?

i. అతను జమ్ జమ్ పవిత్ర జలం సేవిస్తున్నప్పుడు, ఆ పవిత్ర జలం రూపంలో మానవజాతిపై అల్లాహ్ కురిపించిన దీవెనలను జ్ఞాపకం చేసుకొనును. సంవత్సరాల తరబడి, ప్రతి ఏటా మిలియన్ల కొద్దీ ప్రజలు ఆ పవిత్ర జలాన్ని సేవిస్తున్నా, అది ఏనాడూ తరిగిపోలేదు. ఆ పవిత్ర జలాన్ని సేవిస్తున్నప్పుడు వేడుకోమని (దుఆ చేయమని) ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక హదీథ్ లో ఉపదేశించినారు **“ఏ ఉద్దేశ్యంతో జమ్ జమ్ జలం సేవిస్తున్నారో, అది దాని కోసమే (అంటే ఆ ఉద్దేశ్యం పూర్తగును)”** (ఇబ్నె మాజా, అహ్మద్, హదీథ్ గ్రంథాలు. ఇది ఒక హసన్ (సరైన) హదీథ్. జాద్ అల్ మాద్ అనే గ్రంథంలో దీనిని హసన్ హదీథ్ గా ఇబ్నె అల్ ఖయ్యూమ్ (రహిమహుల్లాహ్) వర్గీకరించినారు).

j. అతను సయీ చేస్తున్నప్పుడు అంటే అస్సఫా మరియు అల్ మర్వా కొండల మధ్య పరుగెడుతున్నప్పుడు, ఇస్మాయీల్ అలైహిస్సలాం తల్లి మరియు ఇబ్రాహీం అలైహిస్సలాం భార్య అయిన బీబీ హాజరా ఎదుర్కొన్న పరీక్షా సమయం, ఆవిడ ఆ రెండు కొండల మధ్య నీటి కోసం పరుగెత్తుతూ,

దాహం నుండి తనను మరియు తన ముద్దుల బిడ్డ అయిన ఇస్మాయీల్ అలైహిస్సలాంను రక్షించుకోవటానికి ఆవిడ పడిన తాపత్రయం జ్ఞాపకం చేసుకొనును. ఈ కఠిన పరీక్షా సమయంలో కూడా ఆవిడ చూపిన సహనం మరియు విధేయతతో అల్లాహ్ వైపు మరలటమనేది మానవుడిని కూడా అటువంటి కఠిన పరిస్థితులను అలాగే సహనంతో మరియు దైవవిధేయతతో ఎదుర్కోవలెనని బోధిస్తున్నది. సహనంతో ఆవిడ ఎదుర్కొన్న కఠిన పరిస్థితులను జ్ఞాపకం చేసుకోవటం ద్వారా అతనికి అతని కష్టాల ఎదుర్కోవటం మరియు ఆవిడకు ఆవిడ కష్టాలను ఎదుర్కోవటం సులభమైపోవును.

k. అరఫాహ్ మైదానంలో ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన తోటి హాజీల మధ్య నిలబడటమనేది (వఖూఫ్) హజ్జ్ ప్రయాణికుడికి మొత్తం మానవజాతి సమావేశమయ్యే తీర్పుదినాన్ని జ్ఞాపకం చేయును. వేల సంఖ్యలోని ప్రజల మధ్య నిలబడటానికే హజ్జ్ యాత్రికుడు అలసిపోతే, నగ్నశరీరంతో, నగ్నపాదాలతో, వడుగులు చేయబడని మర్మాంగాలతో ప్రజల మధ్య యాభైవేల సంవత్సరాల పాటు ఎలా నిలుచోగలడు?

l. జమరాత్ అనే ప్రదేశంలో అల్లాహ్ ఆజ్ఞలను శిరసావహిస్తూ గులకరాళ్ళు విసరటం ద్వారా, హజ్జ్ యాత్రికుడు నిస్సందేహంగా, తనలో ఏ ప్రశ్నా తలెత్తనియ్యకుండా ఎలా అల్లాహ్ కు విధేయత చూపాలో స్వయంగా శిక్షణ (తర్ఫీదు) ఇచ్చుకుంటున్నాడు. అలా అతను గులకరాళ్ళు విసరటం (రమ్మి చేయటం) వెనుక గల కారణాన్ని మరియు వివేకాన్ని అర్థం చేసుకోలేకపోయినా, ఇస్లామీయ నియమనిబంధనల మరియు వాటి ప్రయోజనాల మధ్య గల సంబంధాన్ని తెలుసుకోలేకపోయినా వాటిని మనస్పూర్తిగా చిత్తశుద్ధితో ఆచరించటమనేది అతను అల్లాహ్ కు పూర్తిగా సమర్పించుకోవటాన్ని (తౌహీదె ఉలూహియ్యహ్) నిరూపిస్తున్నది.

m. హజ్జ్ యాత్రికుడు తన బలిపశువును అల్లాహ్ పేరుతో బలిచేసినప్పుడు అతనికి ఇబ్రాహీం అలైహిస్సలాం తన చేతికి అంది వచ్చిన, ఏకైక ప్రియపుత్రుడైన ఇస్మాయీల్ అలైహిస్సలాం ను అల్లాహ్ ఆజ్ఞతో బలివ్వటానికి ప్రయత్నించిన సంఘటన జ్ఞాపకం వచ్చును. ఇబ్రాహీం అలైహిస్సలాం అలా చేయటం అల్లాహ్ కు వ్యతిరేకంగా పోయే భావోద్వేగాలకూ ఎలాంటి స్థానం లేదనే విషయం అతనికి జ్ఞాపకం వచ్చును. ఇంకా అల్లాహ్ ఆదేశాలను తప్పకుండా ఆచరించాలని అతనికి బోధిస్తున్నది. ఇదే విషయాన్ని దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా తెలుపుతున్నాడు : **"ఓ నా తండ్రీ!నీకు ఆజ్ఞాపించబడిన దానిని పూర్తి చేయుము. అల్లాహ్ తలిస్తే, నన్ను సహనవంతునిగా గుర్తిస్తావు.'"** *[అస్సాఫ్ఫాత్ 37:102].*

n. అతను తన యొక్క ఇహ్రాం నుండి బయటకు వచ్చిన తర్వాత, ఇహ్రాం స్థితిలో నిషేధించబడినవన్నీ మరల అతనికి అనుమతింపబడును. దీని ద్వారా అతనికి సహనంతో ఉండటం వలన కలిగే ప్రయోజనాలు మరియు కష్టాల తర్వాత సుఖాలు వస్తాయని బోధింపబడుతున్నది. ఎవరైతే అల్లాహ్ యొక్క పిలుపును స్వీకరించారో వారు ఆనందాన్ని, సంతోషాన్ని పొందుతారు. దైవవిధేయత యొక్క మాధుర్యాన్ని రుచి చూసిన వారు మరియు రాత్రి చివరి ఘడియలలో మనస్పూర్తిగా, ఐచ్ఛికంగా నమాజులలో (ఖియాముల్ లైల్, తహజ్జుద్ నమాజులలో) నిలబడే వారు తప్ప ఆ సుఖసంతోషాలను ఇంకెవ్వరూ సరిగ్గా వివరించలేరు.

o. అల్లాహ్ ఆదేశించిన పద్ధతి ప్రకారం మరియు అల్లాహ్ ఇష్టపడే విధానాన్ని అనుసరించి హజ్జ్ యొక్క ఆచారాలన్నీ పూర్తి చేసిన తర్వాత, తన యొక్క పాపాలన్నీ అల్లాహ్ క్షమించివేయునని హజ్జ్ యాత్రికుడు ఆశ పడతాడు. దీనికి ఆధారం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వాగ్దానం చేసిన ఈ హదీథ్ - **"ఎవరైతే కేవలం అల్లాహ్ కోసం మాత్రమే హజ్జ్ చేస్తారో మరియు (భార్యతో) లైంగిక సంపర్కం చేయరో, పాపాలు చేయరో, అనవసరమైన వివాదాలలో పాల్గొనరో, అటువంటి వారు తల్లి (గర్భం) నుండి అప్పుడే జన్మించిన వారిలాగా (పవిత్రంగా) మరలి వస్తారు.** (సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిం హదీథ్ గ్రంథాలు). ఇది అతనిని పాపరహితమైన క్రొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ప్రోత్సహించును.

p. అతను హజ్జ్ యాత్ర పూర్తి చేసి, తన భార్యాబిడ్డల వద్దకు వచ్చి, మరల వారిని కలుసుకున్న సంతోషాన్ని పొందినప్పుడు, స్వర్గంలో మరల వారిని కలుసుకున్నప్పుడు కలిగే గొప్ప సంతోషాన్ని జ్ఞాపకానికి తెస్తుంది. అంతేకాక స్వయంగా తనను తాను నష్టానికి గురి చేసుకోవటం మరియు తన కుటుంబాన్ని నష్టానికి గురిచేయటం అనేది అత్యంత బాధాకరమైనదిగా అతనికి బోధిస్తుంది. ఈ విషయం గురించి దివ్యఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా ప్రకటిస్తున్నాడు: **"ప్రళయదినం నాడు తననూ, తన భార్యాబిడ్డలనూ నష్టంలో పడవేసుకునేవారే అసలైన నష్టానికి గురైనవారు. బాగా వినండి, స్పష్టమైన నష్టం అంటే ఇదే.!"** *[అజ్ జుమర్ 39:15].*

అల్లాహ్ ఆజ్ఞలను విధేయతతో పాటించటానికి, అల్లాహ్ పవిత్ర గృహానికి చేరుకునేందుకు, మనకు ఆదేశించిన పనులన్నింటినీ ఆచరించటానికి సహాయపడమని మరియు మన ప్రియతమ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పై అనేక దీవెనలు పంపమని అల్లాహ్ ను వేడుకుందాము.